ప్రజాశక్తి

శుక్రవారం 12 ఏప్రిల్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

జిల్లా అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ముఖేష్‌కుమార్ మీనా

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

- ఇప్పటికి రూ.100 కోట్లు సీజ్ చేశాం..
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

చెక్‌పోస్ట్‌లో తనిఖీలు ఈ నెల 18 నుంచి ముమ్మరంగా చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. ముందుగా మండల పరిధిలోని గుండ్లపల్లి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్న తీరు, ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తున్న విధానంపై చెక్‌పోస్ట్‌లోని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శింగరాయకొండ వద్ద ఏర్పాటుచేసిన నెల్లూరు, ప్రకాశం జిల్లాల బార్డర్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ముందుగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ రెవెన్యూ అధికారుల ద్వారా ▶ 2లో

ఒంగోలులో క్షణక్షణం

- రెండు పార్టీల మధ్య ఉత్కంఠభరిత పరిస్థితి
- సమతానగర్ ఘటనతో ఆందోళనకర వాతావరణం
- పోలీసులు అప్రమత్తంగా లేకుంటే అదుపు తప్పనున్న శాంతిభద్రతలు

సమతానగర్ ఘటనపై ఎస్‌పికి బుధవారం రాత్రి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కార్యకర్తలు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో రాజకీయ వాతావరణం రెండు పార్టీల నడుమ నివురుగప్పిన నిప్పులా మారింది. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న ఆందోళన కలుగుతోంది. వైసిపి, తెలుగుదేశం పార్టీల నడుమ ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఎన్నికలు సజావుగా జరుగుతాయా? నిర్భయంగా సామాన్యుడు ఓటేసే పరిస్థితి ఉంటుందా? అనే సందేహాలు కలుగుతున్నాయి. గంజాయి, మద్యం మత్తుతో కొందరు యువకులు రాజకీయ పార్టీల వెంట చేరి అరాచకాలకు పరుగులు తీస్తున్నారు. నేతలే వీరిని పెంచి పోషిస్తున్నారు. అధికార పార్టీ వెంటే ఈ తరహా బ్యాచ్ చేరిపోతోంది. ఎందుకంటే పోలీసుల నుంచి కాపాడతారనే భావనతోనే అల్లర్లు చేసేవారంతా పాలక పక్షంలోనే ఉండేందుకు సిద్ధంగా ఉంటారు. ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు అను చరులుగా ఇప్పుడు అల్లరి మూకలే ప్రచారంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. అభ్యర్థులు గానీ, వారి కుటుంబీకులు గానీ వార్డుల్లో అడుగు పెడితే అల్లరి మూకలు, నేరాల్లో ఉన్న వాళ్లే వారి వెంట నడుస్తున్నారు. అన్ని రకాలుగా ప్రచారాల్లో ఉపయోగపడుతున్నారు. నిత్యం వీరికి అవసరమైన పోషణ ఆ వార్డుల్లో ఉండే నేతలు చూసుకుంటున్నారు. ఇలాంటి బాపతు ఇపుడు ఎన్నికల వ్యవహారాల్లో కీలకంగా ఉన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరుగుతాయంటే అంతా భ్రమగానే కని పిస్తోంది. బుధవారం రాత్రి సమతానగర్‌లో జరిగిన కొట్లాటలో అంతా అల్లరిమూకలే.. తప్పు ఎవరిదైనా దాడులు.. అల్లర్లకు పాల్పడ్డది మాత్రం యువకులే.. వీరిని ప్రోత్సహిస్తున్నది మాత్రం రాజకీయ పార్టీల నేతలే.. తప్పంతా వారిదే.. వీరిని అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. గొడవలు ఎందుకు జరిగాయి? ఎవరి ప్రోద్బలంతో జరిగాయి? అనే విషయం కన్నా ఎవరు ఉన్నారనేది చూసి అరెస్టులు ▶ 2లో

సమతానగర్ ఘటనలో..
36 మందిపై కేసు నమోదు ▲ 8లో

బ్యాంకులో తాకట్టు పెట్టిన
బంగారం వెంటనే ఇవ్వాలి..

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల బ్యాంక్ ఆఫ్ బరోడాలో తాకట్టు పెట్టిన బంగారాన్ని వెంటనే ఖాతాదారులకు అందజేసే విధంగా బ్యాంకు అధికారులు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. గురువారం బాపట్ల లో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గంగయ్య మాట్లాడారు. 2021 లో బాపట్ల బ్యాంక్ ఆఫ్ బరోడాలో ▶ 2లో

ఘనంగా రంజాన్

శింగరాయకొండలో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేస్తున్న మంత్రి సురేష్

బాలినేనీ..డ్రామాలు మానుకో.!

- ఆడవాళ్లను అడ్డం పెట్టుకొని నీచ రాజకీయాలు..
- ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుందాం
- ఎమ్మెల్యే బాలినేనిపై దామచర్ల విమర్శలు

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు కావ్యను టిడిపి నాయకులు ఎవరూ ఒక్క మాట అనలేదని, ప్రజలను మభ్యపెట్టేందుకు బాలినేని డ్రామాలు ఆడటం మానుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి నాయకులు ఆగడాలు శృతిమించుతున్నాయని, బుధవారం ఒంగోలు సమతానగర్‌లో చోటు చేసుకున్న సంఘటనే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. గతంలో కమ్మపాలెంలో వైసిపి కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నానా హంగామా సృష్టించి సానుభూతితో గెలిచారన్నారు. అప్పుడు తాను విజయవాడలో ఉన్నానని, వైసిపి నాయకులు చేసిన హడావుడితో టిడిపి నేతలు స్పందించారన్నారు. తాను ఒంగోలులో ఉంటే అటువంటి పరిస్థితి రాకుండా సర్ది చెప్పే వాడినన్నారు. అప్పుడు బాలినేని కుల రాజకీయాలు చేసి గెలిచారని విమర్శించారు. బుధవారం సమతానగర్‌లో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి కోడలు కావ్య ప్రచారం చేస్తున్న విషయం తమకు తెలియదన్నారు. వైసిపి ప్రచారంలో ఓ వాలంటీర్ పాల్గొనటాన్ని అపార్ట్‌మెంట్‌లో ఉన్న మహిళ ప్రశ్నించిందని, ఫొటో కూడా తీసిందన్నారు. తాను వాలంటీర్‌గా రాజీనామా చేశానని, ఫొటో తొలగించాలని కోరటంతో వాలంటీర్‌కు, ఆ మహిళకు మధ్య వాగ్వివాదం నెలకొందన్నారు. అనంతరం అపార్ట్‌మెంట్ వద్దకు 30 మంది వచ్చి మహిళపై దాడి చేశారని, అడ్డుకున్న సదరు మహిళ ఇద్దరు కుమారులపై దాడి చేశారన్నారు. జరిగిన విషయాన్ని అదే డివిజన్‌కు చెందిన టిడిపి నాయకులు మేడికొండ మోహనరావు చెబితే తాను 15 నిమిషాలలో వస్తానని చెప్పానన్నారు. రోడ్డుపై నిలబడి ఉన్న మేడికొండ మోహనరావుపై మద్యం, గంజాయి సేవించిన సుమారు 50 మంది వైసిపి నాయకులు దాడి చేశారని, ఈ దాడిలో మోహనరావుకి కంటి వద్ద, ఒంటిపై తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. బాలినేని కోడలు కావ్యను ఎవరూ ▶ 2లో

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిరోజు ఎన్ని వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ తనిఖీలు ఏ రకంగా ఉంటున్నాయి అనే అంశంపై అడిగి తెలుసుకున్నారు. జాతీయరహదారిలో రెండు వైపులా వెళ తున్న వాహనాలను తనిఖీ చేయాలని ప్రత్యేకంగా వాహనాల్లో మహిళలు ఉంటే మహిళల చేతే తనిఖీలు చేయించాలని సూచించారు. అనంతరం అక్కడ ఉన్న సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి.శ్రీరామ్‌తో ప్రతిరోజూ జరుగుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల్లో పర్యటన చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా జిల్లా బార్డర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలిస్తున్నామన్నారు. గురువారం నాడు నెల్లూరు, ప్రకాశం జిల్లా చెక్‌పోస్టును శింగరాయకొండ వద్ద పరిశీలించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.100 కోట్లు విలువచేసే డబ్బు, మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీరి వెంట కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకష్ణ, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాదరి, కావలి ఆర్డీవో శీనానాయక్, కొండపి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఏ.కుమార్, తహశీల్దార్ భవాని శంకర్, ఎండిఓ నగేష్ కుమారి ఉన్నారు.

ఒంగోలు ఘర్షణపై ఆరా..

ఒంగోలులో బుధవారం రాత్రి తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల గొడవలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌ను అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదిక అందజేయాలని సూచించారు.

వైఎస్ఆర్ వాహనం తనిఖీ

ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల బార్డర్ చెక్‌పోస్ట్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వాహనాన్ని కూడా అధికారులు గురువారం తనిఖీ చేశారు.

బాలినేనీ.. డ్రామాలు మానుకో..

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క మాట అనలేదని, కావ్యపై దాడి చేశారని, అసభ్య పదజాలంతో దూషించారని బాలినేని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ఆడవాళ్లను అడ్డం పెట్టుకొని అబద్ధాలు చెప్పే దుర్మార్గుడు బాలినేని శ్రీనివాసరెడ్డి అని విమర్శించారు. తాము జిల్లా ఎస్పి కార్యాలయానికి చేరుకొని జరిగిన ఘటనపై ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్‌కి ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు చేసి.. బాధితుడిని ఆసుపత్రిలో చేర్చాలని కోరటంతో మోహనరావును ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చేర్చామన్నారు. నలుగురు వైసిపి నేతలు చేతులు కోసుకొని అదే ఆసుపత్రిలో చేరారన్నారు. ఆసుపత్రిలో మోహనరావుకి ప్రాథమిక చికిత్స అందిస్తుండగా సుమారు 500 మంది అనుచరులతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వచ్చి నానా హంగామా సృష్టించారన్నారు. అక్కడ విధులలో ఉన్న పోలీసులు సైతం వారిని అడ్డుకోకుండా ప్రోత్సహించారని విమర్శించారు. ఆసుపత్రిలో ఉన్న టిడిపి నేతలపై వైసిపి నాయకులు దాడికి దిగారని, కార్ల అద్దాలు, ఆసుపత్రి అద్దాలు పగులగొట్టారన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యే అని చెప్పుకుంటున్న బాలినేని ఆసుపత్రికి వచ్చేటప్పుడు అక్కడ రోగులు ఉంటారని, జనాలను వేసుకొని రాకూడదని తెలియదా అని ప్రశ్నించారు. ఆసుపత్రిలోనే తమపై దాడి చేసేందుకు ప్రయత్నించారని, తమ నాయకులు ఎదురు నిలిచారన్నారు. తాను పిలిస్తే వెయ్యి మంది టిడిపి నాయకులు వస్తారని, ఆసుపత్రిలో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోవాలని బాలినేనికి సూచించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి పద్ధతులు మంచివి కావని, ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు, టిడిపి పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటనలు దురదృష్టకరమన్నారు. దాడులు, ప్రతిదాడులు సరైన పద్ధతి కాదన్నారు. ఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పి కార్యాలయానికి చేరుకొని టిడిపి నేతలపై దాడికి పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పిని కోరామన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, జనసేన నగర అధ్యక్షులు మలగా రమేష్, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, వై.శశికాంత్ భూషణ్, చుండి శ్యామ్ పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న టిడిపి అభ్యర్థి ఎంఎం కొండయ్య

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

టిడిపి చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

చీరాల నియోజకవర్గం మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌లో వినాయకుడి గుడి వద్ద పూజా కార్యక్రమాలతో ప్రారంభమై క్లాత్ మార్కెట్లో షాప్ టు షాప్ ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో అత్యధిక షాపు ఓనర్లు శాలువాలతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్యను సత్కరించి తమ మద్దతు ఎప్పుడూ మీకే ఉంటుందని తెలిపారు. క్లాత్ మార్కెట్ ప్రెసిడెంట్ వేముల శేఖర్, సెక్రటరీ తాతా కుమారస్వామి స్వాగతం పలికారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు మామిడిపాక హరిప్రసాద్, పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగ కార్యనిర్వహణ కార్యదర్శి నూతికట్టు పూర్ణ, చీరాల పట్టణ వాణిజ్యభాగ అధ్యక్షులు పోతుగంటి రామాంజనేయులు, సెక్రటరీ శ్రీరాం రమేష్, గార్లపాటి వెంకట శివరామ గుప్తా, బిజెపి బాపట్ల జిల్లా నాయకురాలు భవాని గారు, జనసేన పార్టీ జన సైనికురాలు కారంపూడి పద్మిని, మామిడాల శ్రీనివాసరావు, కర్పూరపు సుబ్బలక్ష్మి, అనపర్తి రత్నబాబు, ఏసోబు, రబ్బవరపు సుధాకర్, తుపాకుల రఘునాథ బాబు, తేలప్రోలు నాగేశ్వరరావు, లావేటి శ్రీనివాస్ తేజ, కూరపాటి పూర్ణ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలులో క్షణక్షణం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తారు. ఈ గొడవల్లో అభ్యర్థులు ఎవరూ అరెస్టు కారు. ఘర్షణలకు కారకులుగా గుర్తించి యువకులనే బాధ్యులుగా చేస్తారు. ఇదంతా ఎవరికీ తెలియదా? తెలిసినా ఎందుకు చేస్తున్నారంటే పార్టీల నేతల అండదండలే.. ఇలాంటి పోకడలతో ఇప్పుడు ఒంగోలు పట్టణంలో రాజకీయవాతావరణం నివురుగప్పిన నిప్పులా ఉంది. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ కూడా ఉంది. ఇరు పార్టీల నడుమ వాతావరణం మాత్రం ప్రశాంతంగా లేదు. ఇంకా చేరికలు.. బెదిరింపులు, ఫిరాయింపులు వంటి వాటితో ఇప్పటికే రెండు పార్టీల నడుమ పరిస్థితి సక్రమంగా లేదు. ఆరోపణలు, ప్రత్యారోపణలూ మరింత దూరం పెంచుతున్నాయి. వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, తెలుగుదేశం అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌లు ఒకరిపై ఒకరు నిత్యం చేసుకుంటున్న హెచ్చరికలు,ఆరోపణలు వార్డుల్లోనూ రెండు పార్టీల నడుమ ఉద్రిక్తతలను పెంచుతోంది. కవ్వింపులకు తావిస్తోంది. సమతానగర్‌లో జరిగిన ఘటనలో రెండుపార్టీల వైపు నుంచీ తప్పు కనిపిస్తోంది. ప్రచారానికి వెళ్లిన మాజీ మంత్రి బాలినేని కోడల్ని అడ్డుకోవడం, దూషించడం సరైనదికాదు. దూషించారనే కారణం చూపి జనంపై దాడిచేయడం ఇంకా తప్పిదం. అదే సమయంలో అక్కడకు వెళ్లిన తెలుగుదేశం నేతలపై దాడిచేయడం మరో తప్పు. ప్రచారం అడ్డుకోవడం తెలుగుదేశం అభిమానుల తప్పుగా కనిపిస్తే.. దాడులు చేయడం వైసిపి నుంచి తీవ్ర తప్పిదంగా కనిపిస్తోంది. ఇలాంటి సంఘటనలు జరుగుతాయని భావించినా పోలీసుల అప్రమత్తత కనిపించడం లేదు. రాజకీయసమీకరణల్లో వచ్చిన మార్పులు పట్టణంలో పలుచోట్ల ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. అంతర్గత కక్షలకు దారితీస్తున్నాయి. పగలను పెంచుతున్నాయి. ప్రతీకారేచ్ఛకూ పాల్పడే అవకాశాలూ కనిపిస్తున్నాయి. గెలుపుకోసం సాగే వ్యూహాల్లో ఘర్షణలు, గొడవలు తప్పవని సంకేతాలు కనిపిస్తున్నాయి. మున్ముందు ఇంకా ఎలాంటి పరిణామాలు తలెత్తుతాయో చూడాలి. కార్యకర్తలు గుంపులుగా మారితే ఎవరూ అదుపుచేయలేరు. ఈ పరిస్థితి రాకుండా పోలీసులు చూడాలి. ఇప్పటికే రాజకీయ ఆరోపణల నేపథ్యంలో ఒక ఎస్పీని మార్చారు. కొత్త ఎస్పీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికైనా పోలీసుల నిఘా గట్టిగా లేకుంటే ఎన్నికల నిర్వహణకు ఈ పరిణామాలు సవాలుగా మారతాయని గుర్తించాలి.

బంగారం వెంటనే ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని అపహరించిన బ్యాంకు ఉద్యోగిపై చర్యలు తీసుకోవడంలో బ్యాంక్ అధికారులు విఫలమయ్యారన్నారు. దీంతో మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఖాతాదారులకు బంగారం డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే బ్యాంకు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ చొరవతో ఖాతాదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేసు విచారణ పేరుతో లబ్ధిదారులకు న్యాయం చేయకపోవడం సరైన చర్య కాదన్నారు. ఖాతాదారులకు బంగారం మార్కెట్ ధరతో పాటు ఆభరణాల తయారీ మజూరీ ఛార్జీలను ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఖాతాదారులతో కలిసి బ్యాంకు వద్ద ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని తిరిగి ఖాతాదారులకు అందజేయడంలో జాప్యం జరగడంతో ప్రజలు బ్యాంకులపై నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎన్. కోటేశ్వరావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న వెంకటేష్ గీత దంపతులు

కరణం వెంకటేష్ ప్రచారం

ప్రజాశక్తి-చీరాల

చీరాల నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్త కరణం వెంకటేష్‌కు సిఎం జగన్మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని, ప్రజలందరూ మద్దతు ఇచ్చి తన భర్తను గెలిపించాలని వెంకటేష్ సతీమణి గీత అన్నారు.

గురువారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పేరాలలో ఎర్రటి ఎండని సైతం లెక్కచేయకుండా ఆమె గడప గడపకూ వైసిపి కరపత్రాలను పంచుతూ ప్రజలతో మమేకమై వెంకటేష్‌తో కలసి ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉండి సమస్యల పరిష్కారం కోసం పనిచేసే వెంకటేష్ గెలుపునకు ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. అయితే ఎన్నికల ప్రచారంలో భర్త వెంకటేష్‌తో కలసి పలుచోట్ల గీత పాల్గొంటూ ఆయా ప్రాంతాల మహిళలను కుటుంబ సభ్యురాలిగా పలకరిస్తూ తనదైన శైలిలో చేస్తున్న ఆమె ఎన్నికల ప్రచారం వైసీపీ మహిళా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్ జగదీష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దావా సమను

మహారాజశ్రీ ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 610/2020

Between
నూకలపాటి రామిరెడ్డి .... వాది
మరియు
ఆళ్ల శ్రీనివాసరెడ్డి ... ప్రతివాది

To
ఆళ్ల శ్రీనివాసరెడ్డి,
తండ్రి ప్రసన్న రాఘవరెడ్డి,
C/o కలికి పెద్దన్న S/o వెంకారెడ్డి,
రామాలయం దగ్గర, దండు రామకృష్ణారెడ్డి
హై స్కూల్ దగ్గర, కొరిశ పాడు పోస్టు
మరియు మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబర్ గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా తేది:30-04-2024 న ఉదయం 10:30 కి వాయిదా ఉన్నందున మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కోనవలసినది లేని యెడల మీ పరోక్షమునందు దావా ను విచారించి తీర్మానించబడునని తెలియజేయడ మైనది.

// కోర్టు వారి అనుమతితో //

వాయిదా తేది : 30-04-2024

ఇట్లు
P.S.V. సత్యనారాయణరెడ్డి
అంగలకుర్తి కోటేశ్వరరావు
B.ఝాన్సీ
వాది తరపున్యాయవాదులు, ఒంగోలు
సెల్ 9390411081, 7993932981,

పబ్లిక్ నోటీసు

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. నెం: 49/22

ఇన్

ఓ.ఎస్.101/2018

యక్కలి మల్లికార్జున .... డి.హెచ్.ఆర్.
వర్సెస్
తిరువీధి పెద్ద వెంకటేశ్వర్లు (చనిపోయినందున)
ఇతర వారసులు
1) తిరువీధి సుధారాణి
2) తిరువీధి విజయసాగర్
3) తిరువీధి సత్యనారాయణ ...... జె.డి.ఆర్స్
అందరూ హిందువులు, ట్రేడర్స్,
డోర్ నెం: 1-464-హెచ్1, బిఎంపిఎస్ ట్రాన్స్‌పోర్టు దగ్గర, విజయాటాకీస్ రోడ్డు, మార్కాపురం టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పిలో డి.హెచ్.ఆర్... జె.డి.ఆర్ నకు నోటీసు జారీ చేయు నిమిత్తం బత్తాకట్టి ఎన్ని పర్యాయములు జె.డి.ఆర్ నోటీసును తీసుకొనటలేదు. అందుకు గానూ కోర్టు వారు మీకు నోటీసులను పేపరు ప్రకటన ద్వారా తెలియజేయ మన్నారు. కోర్టు వారు కోరిన విధంగా పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. మీరు 18-04-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు కోర్టుకు మీరు గానీ, మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరుపడి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయ వలసినది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

ఆకుల ఉషశ్రీ
అడ్వకేట్, మార్కాపురం
సెల్ : 9676864272.

జనరల్ నోటీసు

ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

SAOP No.10/2024

బత్తుల @ రాజులపాటి చాముండీ నాగ ఉదయశ్రీ
మరియొకరు ....పిటిషనర్లు
వర్సెస్
బత్తుల వెంకటేశ్వరరావు అండ్ 2 అదర్స్
... రెస్పాండెంట్స్

పై తెలిపిన కోర్టు వారి ఎదుట పై తెలిపిన పిటిషనర్లు మరియు 2వ రెస్పాండెంట్ అయిన బత్తుల గోవిందమ్మ తమకు 3వరెస్పాండెంట్ అయిన దిబ్రాంచ్ మేనేజర్ HDFC బ్యాంక్ ఒంగోలు వారి నుండి చనిపోయిన బత్తుల క్రాంతి కుమార్ తాలూకు పర్సనల్ యాక్సిడెంట్ డెత్ కవరేజ్ షెడ్యూల్ లో చూయించిన మొత్తమునకు తీసుకొనుటకు గాను పై నెంబర్ పిటిషన్ను దాఖలు చేసుకుని యున్నారు ఇందు విషయమై ఆక్షేపణలు ఉన్నవారు పై తెలిపిన కోర్టు వారి ఎదుట తేదీ 26-04-2024 న ఉదయం 10.30 గంటలకు హాజరుపడి మనవి చేసుకోన వలసినది తెలియజేయడమైనది

షెడ్యూలు

బత్తుల క్రాంతి కుమార్ యొక్క ఎక్సెల్ రేటెడ్ పర్సనల్ యాక్సిడెంట్ డెత్ కవరేజ్ స్కీం ప్రకారం HDFC బ్యాంకు కర్నూలు రోడ్డు బ్రాంచ్ ఒంగోలు వారి నుండి రావలసిన మొత్తం రూ.11,00,000/అక్షరముల పదకొండు లక్షల రూపాయలు మాత్రమే

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఒంగోలు
తేది : 06-04-2024 ఇట్లు
నగరికంటి శ్రీనివాసరావు
అడ్వకేట్ ఫర్ పిటిషనర్స్
ఒంగోలు

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక ఈద్గా మిట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి వైద్యం విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, వైస్ఎంపిపి, వైసిపి మండల అధ్యక్షుడు సామంతుల రవి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

దర్శి : రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక కురిచేడు రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైసిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎం.బాషా, రహమతుల్లా, మాజీ ఎంపిటిసి రహమాన్, మస్తాన్‌వలి, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

శింగరాయకొండలో నమాజ్ నిర్వహిస్తున్న ముస్లింలు

సిఎస్.పురం : మండల పరిధిలోని సిఎస్.పురం, నల్లమడుగుల, కోవిలంపాడు, ఉప్పలపాడు, డీజీపేట, అరివేముల, కొత్తపల్లి గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొండపి : రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే స్వామి ఈద్గా వద్దకు వచ్చి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.రామయ్య చౌదరి, బి.యలమందనాయుడు, బత్తుల నారాయణస్వామి, నన్నూరి సుబ్బరామయ్య, బి.సోమయ్య, ఎస్‌కె.కాలేషా, వసంతరావు పాల్గొన్నారు.

చీమకుర్తి : ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నమాజ్ చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు.

కనిగిరి : రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి టిడిపి కనిగిరి కూటమి అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, వైసిపి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్, టిడిపి నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ చిన్న మస్తాన్, షేక్ ఫిరోజ్, అహ్మద్ పాల్గొన్నారు.

జ్యోతిబా పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి -కనిగిరి

మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వైసిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్‌పిటిసి కస్తూరి రెడ్డి ,పిడిసిసి బ్యాంక్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి , పిసిపల్లి జడ్‌పిటిసి ఓకే రెడ్డి, ఎఎంసి చైర్మన్ చింతగుంట్ల సాల్మన్ రాజ్, కనిగిరి నియోజకవర్గ ఎస్‌సి నాయకుడు కటికల వెంకటరత్నం, ఎంపిటిసి నాగేశ్వరరావు, కనిగిరి పట్టణ ఎస్‌సి సెల్ నాయకుడు కిషోర్, బిటిఎ మాజీ అధ్యక్షుడు ప్రతాప్, ఎస్‌సి నాయకుడు బ్రహ్మయ్య, బీసీసెల్ నాయకులు ద్రోణాదుల చెంచులు, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, కమతం రమణారెడ్డి, సిఎస్‌పురం యూత్ అధ్యక్షుడు బొర్రాజు రమణయ్య, రమేష్ , పలుకూరి భాస్కర్ పాల్గొన్నారు.

డాక్టర్ ఉగ్ర నివాళి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆర్ అండ్ బి బంగ్లా వద్ద ఉన్న పూలే విగ్రహానికి బీసీ సంఘాలతో కలిసి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి, రాజమళ్ళ శ్రీనివాసరెడ్డి, పిచ్చల శ్రీనివాసరెడ్డి, షేక్ ఫిరోజ్, ఐవి. నారాయణ, పి. మాలకొండయ్య, చింతలపూడి తిరుపాలు, విజయరామరాజు, చింతలపూడి వాసుదేవరావు, తమ్మినేని సురేంద్ర రెడ్డి, కొండలు, బ్రహ్మారెడ్డి, మనోహర రావు. ఈదర రవికుమార్, నారాయణ, పాలూరి సత్యం పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కొత్తపట్నం : మండల పరిధిలోని ఈతముక్కల గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సహోదయమ వేదిక రాష్ట్ర కార్యదర్శి గడ్డం అమతవాణి ,రజక సంఘ సభ్యులు బ్రహ్మయ్య ,సోషల్ మీడియా కన్వీనర్ స్వర్ణ సుబ్బారావు, రాజుపాలెం ఎంపిటిసి ఉప్పుటూరి కోటేశ్వరరావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు గడ్డం రామానుజులు, నల్లగట్ల మోహన్ రావు, మద్దిరాల యేసోబు ,బీసీ నాయకులు జాజుల శ్రీనివాసరావు ,పూరి మెట్ల కోటేశ్వరరావు , పిల్లి అంజయ్య, దోనేపూడి ప్రేమ కుమార్, లింగంగుంట కోట్లు, స్వర్ణ ఆంజనేయులు పాల్గొన్నారు.

భారతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

భారతికి మంత్రి నాగార్జున నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

మద్దిపాడు ఎఎంసి మాజీ డైరక్టర్,ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షుడు ఆలపాటి నరసింహారావు తల్లి భారతి మంగళవారం మృతిచెందారు. అందులో భాగంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున కొత్తపేట బజారులోని ఆలపాటి గృహాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా భారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలపాటి నరసింహారావు, ఆలపాటి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, ఆర్యవైశ్యసంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చలువాది బదరి నారాయణ, లయన్స్‌క్లబ్ డైరక్టర్ చలువాది రమేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజేటి హనుమాన్, కొండవేటి ఏడుకొండలు, హరి మల్లికార్జున, నేరెళ్ళ సుబ్రహ్మణ్యం, వైసిపి నాయకులు కె. శేఖరరెడ్డి, పి.గంగయ్య, సుందర రామిరెడ్డి, కోటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -కనిగిరి

మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో రచ్చబండ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, వైసీపీ సీనియర్ నాయకుడు పోతు కొండారెడ్డి డాక్టర్ ఉగ్రకు మద్దతు తెలిపి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన పట్ల విసుకు చెందిన ప్రజలు, వైసిపి నాయకులు టిడిపి ప్రభుత్వం చంద్రబాబు సారథ్యంలో రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో చేరారు. డాక్టర్ ఉగ్ర వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, నాయకులు నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ బారాయి మామ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ పురం: సిఎస్‌పురం మండలం బోయమడుగుల పంచాయతీలోని తుంగొడు, పిల్లిపల్లి, బోయమడుగుల, బాలపల్లి, వెంకటాయచెరువు గ్రామాల్లో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, నాయకులు నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, రామకష్ణంరాజు, కోనంకి వెంకటకొండయ్య, బత్తుల వెంకటాద్రి, పావలి తిరుపతయ్య, కామనబోయిన వెంకటస్వామి, దాసరి మల్లికార్జున, అల్లూరయ్య, వెంకటేశ్వర్లు, చిన్నకొండు తిరుమలయ్య, పాశం వెంకటేశ్వర్లు, గంగిపోగు జోసెఫ్, గాయపు రమేష్, ఆవుల నారు, తిరుమల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

యువకుడు దుర్మరణం

ముండ్లమూరు : ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. . మరో యువ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పూరిమెట్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన చొప్పవరపు గోపి (18), అయ్యప్ప ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. ఎన్ఎస్‌పి కాలువ కట్ట వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న గోపి ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అయ్యప్పకు తీవ్ర గాయాలయ్యాయి.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండపి : చికెన్ దుకాణంలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణ బాజి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... కొండపిలోని మద్దులూరు రోడ్డులో చికెన్ షాపులో రఫీ అనే వ్యక్తి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ చికెన్ దుకాణంపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 29 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న రఫీని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు చెవిరెడ్డి పర్యటన

దర్శి : వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దర్శి నియోజకవర్గంలోని మండలాల్లో శుక్రవారం పర్యటించనున్నట్లు వైసిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా దర్శి వైసిపి కార్యాలయంలో ఉదయం 8 గంటలకు వైసిపి నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దొనకొండ వైసిపి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, కురిచేడులో 12 గంటలకు, ముండ్లమూరులో సాయంత్రం 6 గంటలకు,తాళ్లూరులో రాత్రి 8 గంటలకు వైసిపి నాయకుల ఆత్మీయ పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. పరిచయ కార్యక్రమంలో ఆయా మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాగరాజుకు నివాళి

కొండపి : మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో మావులూరి నాగరాజు దశదిన కర్మ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిచి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎఎంసి మాజీ చైర్మన్ జి.రామయ్య చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు, నారాయణస్వామి, రఘునాథబాబు పాల్గొన్నారు.

రేకుల ఇల్లు దగ్ధం

ముండ్లమూరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ రేకుల ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని పసుపుగల్లు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన కీర్తి వెంకటేశ్వర్లుకు చెందిన రేకుల ఇల్లు దగ్ధమైంది. రూ.20 వేల నగదు, దుస్తులు, బీరువా, ఇతర సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల మేర ఆస్థి నష్టం సంభవించినట్లు వెంకటేశ్వర్లు తెలిపాడు.

నేడు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కొండపి

స్థానిక కామేపల్లి రోడ్డులోనిశ్రీ సాయి సీతారామ కల్యా మండపంలో టిడిపి కూటమి ఉమ్మడి ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కొండపి నియోజక వర్గ అభ్యర్థి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ట్రాక్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాన్‌డీర్ కంపెనీ మేనేజర్ శరత్

కొత్త మోడల్ ట్రాక్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మార్కాపురం

పట్టణంలోని కాలేజీ రోడ్డులోని మార్కెట్ యార్డు సమీపంలోని జాన్ డీర్ ట్రాక్టర్ షో రూంలో ఎసి క్యాబిన్‌తో ఉన్న కొత్త మోడల్ ట్రాక్టర్‌ను కంపెనీ ఏరియా మేనేజర్ శంకర్, సత్యసాయి ఆటోమోటివ్స్ డీలర్ సతీష్ గురువారం ఆవిష్కరించారు. ఏసీ క్యాబిన్, అత్యాధునిక టెక్నాలజీ ఉన్నందున కొనుగోలు చేసినట్లు కొనకలమిట్ల మండలం కాట్రగుంట గ్రామానికి చెందిన రైతు టి శంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జాన్ డిర్ కంపెనీ ఏరియా మేనేజర్ శంకర్ మాట్లాడుతూ అత్యంత అధునాతన టెక్నాలజీతో 75హెచ్‌పి ట్రాక్టర్‌ను కంపెనీ తయారు చేసిందని తెలిపారు. ఈ ట్రాక్టర్‌కు జిపిఎస్ సిస్టం అమర్చబడి ఉందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడ నుండైనా ట్రాక్టర్ ఎక్కడ పనులు చేస్తుందో చూసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పోతురాజు, షో రూమ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొమ్మమూరు కాల్వకు చేరిన సాగర్ జలాలు

కొమ్మమూరు కెనాల్‌కు జలకళ

ప్రజాశక్తి - కారంచేడు

కారంచేడు, చీరాల, పర్చూరు, వేటపాలెం, చినగంజాం మండలాల్లోని గ్రామాలకు తాగు, సాగునీటిని అందిస్తున్న కొమ్మమూరు కాలువ కృష్ణ జలాలతో గురువారం కళకళలాడుతోంది. ఎగువ నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం 950క్యూ సెక్కుల నీటిని విడుదల చేశారు. మండలంలో చిన్న, పెద్ద చెరువులు 16వరకు ఉన్నాయని ఎంపీడీఓ బి బాబూరావు, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్ బాబులు ప్రజాశక్తికి తెలిపారు. కుంకలమర్రు, కారంచేడు, స్వర్ణ, రంగప్పనాయుడు వారిపాలెం, ఆదిపూడి, తిమిడిదపాడు గ్రామాల చెరువులకు నీటిని నింపుకోవడానికి అవసరమైన పంపింగ్ చేసుకోవాలని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో తాగునీటి చెరువులకు అవసరమైన నీటిని నింపుకోవాలని చెప్పారు. సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు తాగు నీటిపై శ్రద్ధ పెట్టి చెరువులు నింపే ఏర్పాట్లు చూడాలని అన్నారు. చీరాల ఎస్ఎస్ ట్యాంకుకూ నింపుకోవాల్సి ఉంది.

లస్సీ పాకెట్లు పంపిణీ చేస్తున్న ఫోటో అసోసియేషన్

లస్సీ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - పొదిలి

రంజాన్ పండుగ సందర్భంగా పొదిలి, కొనకనమిట్ల, మరిపూడి మండలాల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1200లస్సి పాకెట్స్, శీతల పానియాలు పంపిణీ చేశారు. కుల, మతాలకు అతీతంగా చేసే చక్కటి సేవని ముస్లిం సోదరులు, పెద్దలు కొనియాడారు. గత కొన్నేళ్ల నుండి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ రావూరి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాయల్, పి శ్రీను, ప్రసాదు, జి శ్రీను, కృష్ణ, సిహెచ్ శ్రీను, కోటి మల్లి, బి వెంకటేశ్వర్లు, శ్రీధర్, వై వెంకటేశ్వర్లు, ప్రవీణు, జఫ్ఫానియా, రాజు, నారాయణ, దేవా, అభి పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంగయ్య

జ్యోతిరావు పూలేకు నివాళి అర్పిస్తున్న రేపల్లె సిపిఎం నేతలు

ప్రజాశక్తి - బాపట్ల

సామాజిక అసమానతలపై పోరాడిన వారిలో మహాత్మా జ్యోతిరావుపూలే అగ్రగణ్యులని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ గంగయ్య అన్నారు. పూలే 197వ జయంతి సందర్భంగా స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ దేశంలో అట్టడుగు, నిమ్నజాతి వర్గాల కోసం, అసమానతలు పోగొట్టాలని కృషి చేసిన తొలి సామాజిక ఉద్యమ నేత మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. సామాజిక ఉద్యమనేతగా కీర్తిగాంచి మొట్ట మొదటి మహాత్మా బిరుదాంకితులు పూలే అని అన్నారు. చదువు ద్వారానే సమాజంలో అంటరానితనం రూపుమాప గలమని కృషి చేసిన మహనీయుడని అన్నారు. మహిళా సాధికారత, మహిళా హక్కులు, విద్య, ఉపాధి, గౌరవం కోసం పోరాడిన దార్శనికులని అన్నారు. మహిళా విద్య కోసం తన భార్య సావిత్రి బాయికి చదువు చెప్పించి మొదటి మహిళ ఉపాధ్యాయినిగా ప్రోత్సహించారని అన్నారు. సిఐటియు, యుటిఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా ప్రజాసంఘాల నేతలు ఎ శ్రీనివాసరావు, వినయ్ కుమార్, సిహెచ్ మజుందార్, టి కృష్ణమోహన్, నూతలపాటి కోటేశ్వరావు, కుమార్, కె నాగేశ్వరావు, సుభాషిని పాల్గొన్నారు.

స్థానిక చీలు రోడ్డు సెంటర్లో పూలే విగ్రహానికి బాపట్ల పార్లమెంట్ టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎంఎల్ఎ అభ్యర్థి నరేంద్ర వర్మ తనయుడు వేగేశన రాకేష్ వర్మ, జనసేన ఇన్‌ఛార్జి నామన శివన్నారాయణ నివాళి అర్పించారు. సమాజ్ వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు స్థానిక మేధా కాలేజ్ ప్రాంగణంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసే నివాళి అర్పించారు.

సంతమాగులూరు : స్థానిక శాఖా గ్రంధాలయంలో గ్రంథపాలకులు బాదం విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అద్దంకి : మహాత్మ పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ స్థానిక బంగ్లా రోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహాత్మ పూలే 197వ జయంతి సందర్భంగా పులే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంకం కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క కాంతారావు, జై భీమ్ మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోపతోటి శాంసన్ మాట్లాడారు. కార్యక్రమంలో స్వర్ణ వంశీకృష్ణ, శ్రీనివాసరావు, నూతలపాటి హనుమంతరావు, కొంగల శ్రీనివాసరావు, దార్ల శ్రీనివాసరావు, ఏబు, యర్రమోతు నాగయ్య, నల్లగుండ్ల శ్రీనివాసరావు, నాగరాజు, కొండ్ర వీరాంజనేయులు, తిప్పాబత్తిన వెంకట్రావు, అశోక్, బేతాళ పూర్ణచంద్రరావు, పులి వికాస్, సాంబశివరావు, వీరు, బాబురావు, అంకమ్మరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక అంకమ్మ కాలనీలో జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంఎస్‌పి జిల్లా కో కన్వీనర్ పల్లెపాగు నాని మాదిగ, ఎడ్లూరి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కోడూరి హరీష్, ఏజర్ల ప్రవీణ్, బౌతుల రాజేష్, పల్లెపాటి బాబు మాదిగ, కారుమూరి రాజేష్, ఏజర్ల రవీంద్ర, పల్లపాటి సుధాకర్ పాల్గొన్నారు.

రేపల్లె : మహాత్మా జ్యోతిరావుపూలే 197వ జయంతిని సీపీఎం కార్యాలయంలో ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి సీపీఎం, ప్రజా సంఘాలు నాయకులు వై కిషోర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడారు. దేశంలో అట్టడుగు వర్గాల, జాతుల కోసం అసమానతలు పోగొట్టాలని కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘాలు నేతలు కెవి లక్ష్మణరావు, వై కిషోర్, కె ఆశ్విరాధం, యు నాంచారయ్య పాల్గొన్నారు. ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ తన కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

భట్టిప్రోలు : సంఘసంస్కర్త, సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు అన్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు, మోర్ల సత్యనారాయణ, బాలాజీ, మల్లేశ్వరరావు, పడమటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇంకొల్లులో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రచారంలో యువ నేత గొట్టిపాటి హర్షవర్ధన్

పన్నులు, చార్జీలు పెంచనని హామీలు గుప్పించిన జగన్ అధికారంలోకి రాగానే ఎడాపెడా బస్సు, విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలకు వాతలు పెట్టారని ఎంఎల్ఎ గొట్టిపాటి రవి కుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. మండలంలోని కుందుర్రు గ్రామంలో తన తండ్రి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తేలప్రోలు రమేష్, కొప్పక కొండలు, చవల నాగేశ్వరరావు, నాగబోతు సుజాత, కొనికి గోవిందమ్మ, గురు యాదవ్, మాదాల సుబ్బారావు, ఏసోబు పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి సాగనంపాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సమావేశంలో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

వైసిపి నిరంకుశ అవినీతి పాలన అంతం కోసం ప్రజలందరూ ఏకం కావాలని, వైసీపిని ఇంటికి సాగనంపాలని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు కోరారు. తన క్యాంపు కార్యాలయంలో టీడీపి, జనసేన, బిజెపి సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో ఏలూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి, భావితరాల భవిష్యత్తు కోసం కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి మంచి మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించి అభివృద్ధిని పునరుద్ధరిస్తామని అన్నారు. సమావేశంలో బీజేపి జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన ఇన్చార్జి పెదపూడి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గొట్టిపాటి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

కొరిశపాడు మండలం తిమ్మన పాలెం సర్పంచ్ సాదినేని శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముసులూరి వెంకట్రావు, సాదినేని రఘుబాబు, ముసులూరి రమేష్ బాబు, నూతలపాటి చలపతిరావు, ఫనిదం ఏడుకొండలు, బెల్లం రవీంద్ర బాబు, తూమాటి హర్షవర్ధన్, సాదినేని బ్రహ్మం, సాదినేని రామకృష్ణ, ముసునూరి అఖిల్, సాదినేని శ్రీధర్ బాబు, గాడిపర్తి వెంకటేశ్వర్లు ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో గురువారం టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అసత్యాలు రాయొద్దు

ప్రజాశక్తి - అద్దంకి

మాట్లాడుతున్న హనిమిరెడ్డి

ఒక న్యూస్ ఛానల్, ఒక దిన పత్రిక (ప్రజాశక్తి కాదు) దుష్ప్రచారమైన వార్తలు ప్రచురిస్తున్నారని వైసిపి అభ్యర్థి హనిమిరెడ్డి ఆరోపించారు. తప్పుడు వార్తలు రాయవద్దని కోరారు. గత నాలుగు నెలలుగా నియోజకవర్గంలో తాను పర్యటిస్తున్నట్లు తెలిపారు. తాను కేవలం ఐదు రోజులు మాత్రమే వ్యక్తిగత పనులపై హైదరాబాదుకు వెళ్లానని, దీనికే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశానని రాయడం ఏమిటని అన్నారు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేయలేదని, ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి అద్దంకి సీటు బహుమతిగా ఇస్తానని అన్నారు.

టిడిపి ప్రచార రథంపై దాడి

ప్రజాశక్తి - సంతమాగులూరు

దెబ్బతిన్న ప్రచార రథం

మండలంలోని ఏల్చూరు గ్రామంలో టిడిపి ఎన్నికల ప్రచార రథంపై వైసీపీ కార్యకర్తలు గురువారం దాడి చేశారని ప్రచార రథం డ్రైవర్ అన్నపునేని సునీల్ తెలిపారు. తాను మైక్ ఆపరేటర్ శ్రీను కలసి వెల్లలచెరువు, కామేపల్లి, పుట్టావారిపాలెం గ్రామాల్లో టిడిపి ఎన్నికల ప్రచారం పూర్తి చేసుకుని మధ్యాహ్నం ఏల్చూరు గ్రామంలో రెడ్ల బజారులో ప్రచారం చేస్తుండగా రెడ్ల బజారుకు చెందిన ఐదుగురు యువకులు తనను చొక్కా పట్టుకుని వాహనం నుండి కిందకి లాగి రెడ్ల బజారులోకి టిడిపి ప్రచార రథాన్ని తీసుకొస్తావా అంటూ బండబూతులు తిట్టి రాళ్లతో దాడి చేశారని తెలిపారు. టిడిపి, జనసేన జెండాలను చించి వేశారని తెలిపారు. ఎస్ఐ పి సురేష్‌కు పిర్యాదు చేశారు.

పార్టీలో చేరిన వారితో టిడిపి నాయకులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కురిచేడు

మండల పరిధిలోని పొట్లపాడు గ్రామంలో గ్రామ సర్పంచి జ్యోతి వెంకటయ్య అంకాలు ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు గురువారం టిడిపిలో చేరారు. టిడిపి దర్శి నియోజక అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్, పమిడి రమేష్ సమక్షంలో వారు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో బేతంశెట్టి బ్రహ్మయ్య, చమిడిశెట్టి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు నెమిలయ్య, మాజీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో విజయకుమార్

చీమకుర్తిలో...

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని తొర్రగుడిపాడు దళితవాడకు చెందిన 30 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. టిడిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జి బిఎన్. విజయకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. విజయకుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, మాజీ ఎంపిటిసి కొమ్ము ఆశ్వీరాదం,కొమ్ము ఎలీషా, అబ్రహం, తెలగలపూడి కోటేశ్వరరావు, సుందరరావు, సాల్మన్‌రాజు, పేతురు, ఇశ్రాయిల్, మోషే పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

30 కుటుంబాలు టిడిపిలో చేరిక

శింగరాయకొండ : పాత శింగరాయకొండ శ్రీ వరహాలక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ గోకరాజు పాపయ్య నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు , కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమక్షంలో 30 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, కూనపు రెడ్డి వెంకటసుబ్బారావు, షేక్ సంధాని బాషా, ఇమ్మడిశెట్టి రామారావు, మందలపు గాంధీ చౌదరి, చిగురుపాటి శేషగిరి, మించల బ్రహ్మయ్య, నక్క బ్రహ్మేశ్వర రావు, షేక్ అబ్దుల్ సబాహాన్ , ఉప్పురెట్ల రవీంద్ర, బైరపనేని మోహన్ రావు , కాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.9,14,958

ప్రజాశక్తి-కొండపి

ఉగాది పండుగ సందర్భంగా జాళ్లపాలెం శ్రీ బ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆదాయం రూ.9,14,958 వచ్చిన ఎండోమెంటో అధికారి కొండారెడ్డి తెలిపారు. హుండీల ద్వారా రూ.6,17,782, విరాళాల రూపంలో రూ.2,05,614, రశీదుల ద్వారా చందాలుగా రూ.91,562 కలిపి మొత్తం రూ.9,14,958 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి కూటమి దర్శి నియోజకవర్గ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి కూటమి దర్శి నియోజక అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని 9, 11వ వార్డుల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ టిడిపి హయాంలోనే దర్శి నియోజక వర్గ అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు లక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు శోభారాణి, పుల్లలచెరువు చిన్న, దారం సుబ్బారావు, సంగు కొండలు, తిండి నారా యణరెడ్డి, కొండయ్య, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో గొట్టిపాటి లక్ష్మి, మాగుంట రాఘవ

టిడిపిలో చేరిక

దర్శి ఎఎంసి మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరారు. టిడిపి కూటమి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త కడియాల లలిత సాగర్, మాగుంట రాఘవరెడ్డి, పమిడి రమేష్ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో బీసీలకు సముచిత స్థానం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

వైసిపిలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైసిపి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరులోనున్న కాపుకల్యాణ మండపంలో బీసీల ఆత్మీయ సమావేశం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చి బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించినట్లు తెలిపారు. తుని రైల్వే ఘటనలో బీసీలపై ఉన్న కేసులను ఎత్తివేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు దేవినేని మల్లికార్జునరావు, రాష్ట్ర మాదిగ

మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, లిడ్ క్యాప్ డైరెక్టరు కంచర్ల సుధాకర్ ,ఎఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి నలమలపు కష్ణారెడ్డి,శాలివాహన కార్పొరేషన్ ,హౌసింగ్ బోర్డు డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పి. శ్రీమన్నారాయణ, కె.సుధాకర్ ,పి. వజ్రంబాబు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి కృషి

టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ప్రజాశక్తి -కనిగిరి

టిడిపితోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి దుర్మార్గపు పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. జగన్ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి 56 పైసలు కూడా ఇవ్వకుండా బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి, బేరి పుల్లారెడ్డి,షేక్ ఫిరోజ్, రాజు, గోన ప్రతాప్, విజయ భాస్కర్ రెడ్డి, పాలూరి సత్యం, చింతలపూడి తిరుపాలు, సిహెచ్.వాసుదేవరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నూకసాని బాలాజీ , టిడిపి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

నూకసాని బాలాజీకి సన్మానం

స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీని టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు పల్లా మాలకొండయ్య, ముదిరాజ్ బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర మెంబర్ ఈర్ల విజయరామరాజు, నాయీబ్రాహ్మణ సాధికారిక జిల్లా కన్వీనర్ పాలూరి సత్యం, టిడిపి మండల ఉపాధ్యక్షుడు చావలి వెంకటేశ్వర్లు, చింతలపూడి వాసుదేవరావు,ఈదర రవికుమార్, వాల్మీకి సంఘ నాయకులు సుబ్బారావు, గడ్డి నరసింహులు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఐవి.నారాయణ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

వైసిపి పాలనలో సంక్షోభం : అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

వైసిపి పాలనలో రాష్ట్రంలో సంక్షోభం నెలకొన్నట్లు టిడిపి కూటమి గిద్దలూరు నియోజక వర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ముస్లిములకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జగన్‌మోహన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాలను రద్దు చేసినట్లు తెలిపారు. జగన్‌రెడ్డి అనుచరుల అరాచకాలు, వేధింపులతో రాష్ట్రంలో అనేక మంది మైనార్టీలు అశువులు బాశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెల్లంకొండ సాయిబాబు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

మాదిగల ఆత్మీయ సమావేశం

శింగరాయకొండ : దళితులను ముంచిన వైసిపిని తరిమికొట్టాలని టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్.రాజు అన్నారు. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు వద్ద కొండపి నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమ్మేళనం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, టిడిపి కొండపి నియోజక వర్గ అభ్యరి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దామచర్ల సత్య , పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి , బెల్లం సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, ఐనంపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

100 కుటుంబాలు టిడిపిలో చేరిక

హనుమంతునిపాడు : మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలో కూరాకు వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో 100 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుందూరు తిరుపతిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, దొడ్డి చింతల సర్పంచి సానికొమ్ము బ్రహ్మ రెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, మురారి నరసయ్య, ఎస్సి సెల్ అధ్యక్షుడు తాతపూడి బుజ్జి, ఎంపిటిసి సుబ్బారెడ్డి, శేషయ్య, వేములపాడు సర్పంచి తిరుపతయ్య పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో గురువారం ముస్లిములు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠోరమైన ఉపవాసాలు ఉన్న వీరంతా బుధవారం రాత్రి నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఉదయం పది గంటలకే ముస్లిములంతా పట్టణానికి సమీపంలో గల ఈద్గా దగ్గరకు చేరుకున్నారు. అక్కడ ముస్లిం మత పెద్ద సయ్యద్ మహ్మద్ ఇస్మాయిల్ హిదయతుల్లా మౌలానా రంజాన్ పండుగ ప్రత్యేక నమాజులు చదివించారు. కాలం కలిసి రావాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని దువా చేశారు. అనంతరం ముస్లిములు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. కొత్త బట్టలు ధరించి ఇండ్లలో సేమియాలు, బిర్యానీలు వండుకొని విందులకు పిలుచుకున్నారు. పేద ముస్లిములకు ఫిత్రాలు ఇచ్చారు. హిందూ ముస్లిం భాయీ భాయీ అంటూ రంజాన్ పండుగను మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ముస్లిములు పండుగను ఘనంగా జరుపుకున్నారు.

శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు

రంజాన్ ప్రత్యేక నమాజు చదువుతున్న ముస్లిములు

రంజాన్ పండుగ ప్రత్యేక నమాజు చదివే ఈద్గా దగ్గరకు యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బూదాల అజితారావు ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ముస్లిములు నమాజు పూర్తి చేసుకున్న తర్వాత వారు ఈద్‌ముబారక్ తెలిపారు. చిన్నారులతో కరచాలనం చేశారు. వారి వెంట వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల పట్టణంలో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజులు చదివారు. స్నేహితులను ఇళ్లకు పిలుచుకున్నారు. బిర్యానిలు, సేమియాలు వండుకొని విందులిచ్చారు.

కంభం రూరల్: ప్రకాశం జిల్లా కంభంలో ముస్లిములు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 9గంటలకు ముస్లిములందరూ ఈద్గా వద్దకు చేరుకొని రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు కౌగలించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి ముస్లిములను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మత గురువులు ప్రపంచ వ్యాప్తంగా శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థనలు చేశారు.

సంతనూతలపాడు: రంజాన్ పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంతనూతలపాడులోని ఈద్గాలో ఇస్లాం మతపెద్దల ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనల్లో పెద్దఎత్తున ముస్లిములు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. బంధువులు, స్నేహితులతో విందులు ఏర్పాటు చేసుకున్నారు. తమ శక్తి కొద్దీ దానధర్మాలు చేశారు.

గ్రూపు-2 ఫలితాల్లో సత్తా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాలలో యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదివిన టి కిరణ్, ఎం కమలాకర్, కె తిరుపతిరెడ్డి, ఎం శిరీష, జి గాయత్రిదేవి, వై షాలెమ్‌రాజు అనే ఆరుగురు విద్యార్థులు ప్రిలిమ్స్‌లో మంచి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అత్యంత ప్రతిభ కనబరిచిన ఆ విద్యార్థులను ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీధర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి ప్రదీప్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మన్నె, టిడిపి శ్రేణులు

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జరగనున్న ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని టిడిపి సీనియర్ నాయకుడు డాక్టర్ మన్నె రవీంద్ర తెలిపారు. గురువారం టిడిపి ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్నె రవీంద్ర మాట్లాడుతూ వైసీపీ అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటా ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం ఏర్పడేలా టిడిపి, జనసేన, బిజెపిలు కలిసి పని చేస్తున్నాయన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రం చాలా వెనుకబాటుకు గురైందని చెప్పారు. రాష్ట్రంలో స్వచ్ఛమైన పాలన రావాలంటే తిరిగి టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు, ఒంగోలు ఎంపిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసులురెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరి ఎరిక్షన్‌బాబు కుమారుడు అజిత్, కుమార్తె డాక్టర్ చెల్సియా, టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు వెంకట్రావు గౌడ్, వేగినాటి శ్రీనివాస్, కె భాస్కర్, రవణమ్మ, కాశయ్య, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, శ్రీశైలపతి నాయుడు, మస్తాన్‌వలి, వలి, పాలడుగు వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులకు అభినందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర పరిధిలోని అరుణోదయ కాలనీ పీర్లమాన్యం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులకు, సిబ్బందికి నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ అధికారులు అభినందనలు తెలిపారు. ఫిబ్రవరి 23, 24 తేదీలలో జరిపిన తనిఖీ కార్యక్రమంలో వసతులను, రోగులకు అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారి బృందం సభ్యులు డాక్టర్ నితిన్ భరద్వాజ్, డాక్టర్ కల్పనా శంకరన్, పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్, హాస్పటల్ సిబ్బంది, క్వాలిటీ మేనేజర్ కృష్ణ ప్రసాద్, హెచ్‌వి సుజాత, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పూలే ఆశయాలు కొనసాగిద్దాం

ప్రజాశక్తి-చీరాల: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో పలువురు నివాళులు అర్పించారు. వడియారం సెంటర్లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 200 సంవత్సరాల క్రితం నిమ్న వర్గాల అభ్యున్నతికి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా స్త్రీ విద్య కోసం పోరాడిన యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని, అందుకే ఆయన అంబేద్కర్‌కు గురువు అయ్యారని అన్నారు. భారతదేశంలో తొలి సంఘసంస్కర్త అయిన పూలే ఆశయాలు కొనసాగిస్తామని వక్తలు వివరించారు. గడియార స్తంభం వద్ద జరిగిన సమావేశానికి కెవిపిఎస్ నాయకులు ఎల్ జయరాజ్ అధ్యక్ష వహించారు. అడ్వకేట్ మస్తాన్‌రావు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు పి జనార్ధన్, ఊటుకూరు వెంకటేశ్వర్లు, ఎన్ బాబురావు, గుమ్మడి ఏసురత్నం, పి కొండయ్య, ఎం వసంతరావు, మొద్దు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు రంజాన్ తోఫా అందజేసిన బీఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట 41వ డివిజన్ ఉత్తర బజార్‌లోని మసీదులో గురువారం భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదిన వేడుకలను 41వ డివిజన్ జనసేన అధ్యక్షుడు శ్రీనివాస పవన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ టీడీపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు (బాబు) హాజరయ్యారు. వీరు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ తోఫా అందించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి ఆంజనేయులు, నగర ప్రధాన కార్యదర్శి కందుకూరు వాసు, నగర సంయుక్త కార్యదర్శి ఇంకొల్లు శ్రీమన్నారాయణ, 42వ డివిజన్ అధ్యక్షుడు చల్లా కృష్ణ, తిరుమలశెట్టి రాము, మేకల పూర్ణచంద్రరావు, కామేపల్లి సుబ్బారావు, రాయపాటి అంకబాబు, గంగిశెట్టి రాముడు, మోహన్ కృష్ణా, వివరం గోవిందయ్య, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, దగ్గుపాటి హనుమంతరావు, దగ్గుపాటి శ్రీను, తన్నీరు రామారావు పాల్గొన్నారు.

బలరాంను విమర్శించే స్థాయి 'ఆమంచి'కి లేదు

ప్రజాశక్తి-చీరాల

ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

దందాలకు మారు పేరైనా ఆమంచి కృష్ణమోహన్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వైసిపి నాయకులు అన్నారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తి నీతులు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని, చీరాలను ప్రశాంత వాతావరణంలో పరిపాలన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. గురువారం రామకృష్ణాపురం వైసీపీ క్యాంప్ కార్యాలయంలో రూరల్ అధ్యక్షులు అంకాలరెడ్డి అధ్యక్షతన వైసీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జి మాట్లాడుతూ ఆమంచి బ్రిటిష్ పాలన చూసి విసుగుపోయిన చీరాల నియోజకవర్గం ప్రజలు 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడించి ఇంటికి సాగనంపారని, అదే సీను 2024 ఎన్నికల్లో మరోసారి చూపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పలువురు మాట్లాడుతూ చీరాలలో పరాజయం పొందిన ఆమంచిని పర్చూరు ఇన్‌ఛార్జిగా సిఎం జగన్మోహన్‌రెడ్డి పంపితే అక్కడ కూడా బుద్ధి మార్చుకోకుండా దందాలు కొనసాగిస్తూ ఇసుక, మైనింగ్, వ్యాపారులను టాక్స్ పేరుతో బెదిరించి నెలకు సుమారు రూ.3.30 కోట్లు చొప్పున 14 నెలలుగా వసూలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయని అన్నారు. వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలతో పర్చూరు దళిత సర్పంచ్ ఠాకూర్ సిఎం జగన్‌కు ఫిర్యాదు చేస్తే ఆయనపై అక్రమ కేసులు పెట్టించిన ఘనత ఆమంచిదని విమర్శించారు. జర్నలిస్ట్ నాగార్జునరెడ్డిపై పందిళ్లపల్లి బైపాస్‌లో దాడిచేసి, హత్యాయత్నం చేసి 8వ వార్డు కాలువలో పడేసి ఆ కేసులను దళితులపైన బనాయించాలని చూశారని ఆరోపించారు. దళిత నాయకుడు యాతం ఆనందరావు బిల్డింగును నిలువునా కూల్చేశారన్నారు. తోటవారిపాలెంలో ఓ మహిళకు చెందిన హోటల్‌ను తొలగిస్తే బలరాం సహకారంతో తిరిగి ఆమె హోటల్ నిర్వహించుకుంటోందని అన్నారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌కు ప్రజలందరూ మద్దతునిచ్చి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, గవిని శ్రీనివాసరావు, యాతం మేరి బాబు, గుంటూరు మాధవరావు, వాసిమళ్ల వాసు, జ్వాలా, రమణారెడ్డి పలువురు పాల్గొన్నారు.

చీరాలలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కరణం వెంకటేష్ తదితరులు

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

ప్రజాశక్తి-గిద్దలూరు

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని జ్యోతిరావు పూలే పార్కులోని ఆయన విగ్రహానికి బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ మాట్లాడుతూ పేద బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావుపూలే అట్టడుగు వర్గాలకు ఎనలేని సేవలందించారని, పేదల జీవితాలలో వెలుగులు నింపారని కొనియాడారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11వ తేదీ జ్యోతిరావు పూలే జయంతి రోజున ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అశ్వని కుమార్, బాలరంగయ్య, బాల గురవయ్య, రంగ వరప్రసాద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: భారతదేశంలో అక్షరజ్ఞానం అందరికీ కావాలని ఆకాంక్షించిన తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. గురువారం యర్రగొండ పాలెంలో మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సావిత్రిబాయికి చదువు చెప్పించి ఆమెను తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా చేసిన ఘనత ఆమె భర్త మహాత్మా జ్యోతిరావు పూలేకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, జడ్పి కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాబీర్ బాషా, సొసైటీ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాచి, నాయకులు ఒంగోలు సుబ్బారెడ్డి, రాములు నాయక్, గోవిందరెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

చీరాల: జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కరణం వెంకటేష్ బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ఆయన ఆశయాలు ఆదర్శవంతం అని, ఈతరం యువత అందరూ ఆయన ఆదర్శాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల దీనజన బాంధవుడు, భావితరాలకు స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, నాయకులు చెరుకూరి హరికృష్ణ, పావులూరి నారాయణస్వామి చౌదరి, నన్నూరి నాగేశ్వరరావు, వేమా అంకంశెట్టి, నల్లూరి గోపి, ఎం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు పార్లమెంటుపై టిడిపి, వైసిపి కుస్తీ

• పొదిలి కేంద్రంగా 'చెవిరెడ్డి' • మార్కాపురంలో 'మాగుంట' • పోటాపోటీ ప్రచారంలో ఇద్దరు నేతలు

ప్రజాశక్తి - మార్కాపురం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం శాసనసభ నియోజకవర్గాలు ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి గెలుపులో కీలకంగా మారాయి. ఆయా నియోజకవర్గాల్లో వైసిపికి గట్టి పట్టుంది. టిడిపి కూడా ఇక్కడే బలాన్ని పెంచుకోవాలని చూస్తోంది. వైసిపి పట్టు నిలుపుకోవాలని, టిడిపి పట్టు సాధించాలని వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పొదిలి పట్టణంలో, టిడిపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి మార్కాపురం కేంద్రంగా దృష్టిపెట్టారు.

మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలు వైసిపికి అనుకూలంగా ఉన్నాయి. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఈ మూడు నియోజకవర్గాల్లో వైసిపి నుండి పోటీ చేసిన అభ్యర్థులే గెలుపొందారు. ఈ సారి కూడా పట్టు సాధిస్తామనే ధీమాతో వైసిపి ఉంది. ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి భవితవ్యాన్ని తేల్చేది కూడా ఈ మూడు నియోజకవర్గాల్లోని ఓటర్లే కావడం గమనార్హం. ఒంగోలు, కొండేపి, దర్శి, కనిగిరి నియోజక వర్గాల్లో నువ్వా నేనా అన్న రీతిలో టిడిపి, వైసిపి ఓట్లు సాధించినప్పటికీ మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండ పాలెం నియోజకవర్గాలకు వచ్చే సరికి వైసిపి బలం

మాగుంట శ్రీనివాసులరెడ్డి

చెవిరెడ్డి భాస్కరరెడ్డి

పెరుగుతూ వస్తోంది. దీంతో టిడిపి పార్లమెంటు అభ్యర్థిగా ఎవరు బరిలో నిలిచినా గత మూడు దఫాలు ఓటమి పాలవుతున్నారు. ఈ సారి ఎలాగైనా టిడిపి గెలవాలనే లక్ష్యంతో టిడిపి ఎంపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి మార్కాపురంలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. మాగుంట కుటుంబీకులు, అనుచరులు ఇక్కడే ఉంటున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో మాగుంట పరిచయాలను కూడదీస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో తమ గెలుపునకు సహకరించాలని పరిచయం కలిగిన వైసిపి నేతలతో సైతం మాగుంట మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. ఎక్కువ సమయం మార్కాపురం ప్రాంతంపై దృష్టి సారిస్తున్నారు. మాగుంట రాకతో కొందరు మాగుంట రాఘవరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. మాగుంట శ్రీనివాసులరెడ్డి వైసిపి ఓట్లకు గాలం వేస్తున్నారని ప్రచారం జరగడంతో వైసిపి ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కూడా మార్కాపురం నియోజకవర్గం లోనే ఎక్కువ సమయం ఉంటున్నారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి పొదిలి పట్టణంలో నివాసం ఉంటున్నారు. వైసిపికి పట్టున్న మార్కాపురం ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మాగుంట చేరికలకు ధీటుగా మార్కాపురంలో కనీవిని ఎరుగని రీతిలో వేలాది మోటార్ సైకిళ్లతో చెవిరెడ్డి భారీ ర్యాలీ చేపట్టారు. టిడిపిలో ఇటీవల చేరిన వారిని సైతం ఆలోచింపజేసేలా వైసిపి బైక్ ర్యాలీ నిర్వహించారు. టిడిపిలో చేరికలకు ధీటుగా వైసిపిలోనూ టిడిపికి చెందిన వారిని చేర్చుకోవడం చర్చనీయాంశమైంది. టిడిపిలో ప్రస్తుతం చేరిన వారిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపికి పని చేసిన వారే అధికంగా ఉండటంతో వైసిపికి వచ్చిన నష్టమేమీ లేదని ఆ పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే ఎంపి అభ్యర్థులే కీలకంగా వ్యవహరి స్తున్నారు. గత ఎన్నికల్లో వైసిపి ఎంపి అభ్యర్థికి ఈ మూడు నియోజకవర్గాల నుంచి లక్షా 35వేల ఓట్లకుపైగా మెజార్టీ రావడం విశేషం. ఇదే క్రమంలో వైసిపి తమ బలాన్ని నిలుపుకోవాలని ప్రయత్నిస్తోంది. టిడిపి మాత్రం వైసిపి మెజార్టీని తగ్గిస్తూ తమ బలం పెంచుకోవాలనే విధంగా పావులు కదుపుతోంది. ఎవరు పట్టు సాధిస్తారో వేచి చూడాల్సి ఉంది.

వికటించిన ఫేస్ బుక్ ప్రేమ

ప్రజాశక్తి - పొదిలి

ఫేస్‌బుక్ పరిచయంతో ఆకర్షణకు లోనవుతున్నారు. సహజీవనానికి సిద్ధపడుతున్నారు. ఈ సంఘటన గురువారం పొదిలి బస్టాండ్ కేంద్రంగా గురువారం బహిర్గతమైంది. ఏడాది క్రితం ఫేస్ బుక్ ద్వారా నంద్యాలకు చెందిన ఒక యువతికి, దర్శి మండలం బండి వెలిగండ్ల గ్రామానికి చెందిన యువకునితో ఫేస్‌బుక్‌లో పరిచయమై ప్రేమగా మారింది. ఆ తరువాత పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. యువకుని వైపు నుంచి ఏమి ఆశించిందో తెలియదు కానీ ఆ యువతి పెళ్లి విషయం పక్కన పెట్టి సహజీవనానికి సిద్ధపడింది. తల్లిదండ్రులను కాదని 10నెలల క్రితం ప్రియుడి వద్దకు చేరింది. అతనితో సహజీవనం ప్రారంభించింది. రోజులు గడిచే కొద్ది యువకుడి అసలు రంగు బయట పడింది. మద్యానికి బానిసైన యువకుడు రోజు ఆమెను వేధింపుల గురి చేస్తున్నాడని ఆరోపించింది. ప్రియుడి వేదింపులు తాళలేక యువతి తిరిగి ప్రయాణమైంది. తన పుట్టిల్లు నంద్యాల వెళ్లేందుకు పొదిలి బస్టాండుకు వచ్చింది. స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఉన్న యువతిని వెంబడించిన యువకుడు బలవంతంగా ఆమెను తన ఇంటికి తీసుకు పొయే ప్రయత్నంలో ఇరువురు ఘర్షణ పడ్డారు. యువతిపై దాడి చేసేందుకు ప్రయత్నించిన యువకుడిని అక్కడున్న ఆర్టిసి సిబ్బంది, ప్రయాణికులు అడ్డుకున్నారు. జరిగిన విషయం ఆమె ఆర్టీసీ సిబ్బందికి మొరపెట్టుకుంది. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇరువురిని విచారించారు. యువతిని సొంత పట్టణానికి పంపించారు. ప్రియుడిని ఇంటికి పంపించారు.

మాట్లాడుతున్న పటాన్ రాజేష్

కాంగ్రెస్ సీటు స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

కాంగ్రెస్ బాపట్ల ఎంఎల్ఎ సీటు స్థానికులకే ఇవ్వాలని కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు పఠాన్ రాజేష్ కోరారు. స్థానిక నాయకులను గుర్తి లేకపోవడం శోచనీయమని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మైనారిటీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థిత్వాన్ని తాను ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న స్థానికులను వదిలేసి ఎంఎల్ఎ అభ్యర్థిత్వాన్ని ఇతర ప్రాంతాల వారికి కేటాయిస్తే పార్టీకి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు.

జైభీం చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

సామాజిక విప్లవకారుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతి రావ్‌పూలే 197వ జయంతి సందర్భంగా స్థానిక బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏపీ ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీస్ ఐక్యవేదిక, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఎం సత్య నారాయణ చేతుల మీదుగా గురువారం చలివేంద్రం ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఎఈ గడ్డం హనుమంతరావు, గోగుల విరాంజనేయులుకు కమిషనర్ తొలుత మజ్జిగ అందజేశారు. బల్లికురవ ఇంజనీర్ గడ్డం హను మంతరావు, పంగులూరు ఎంఇఒ గోగుల వీరాంజనే యులు, చారిత్రక పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్‌జెడి ఉబ్బా దేవపాలన, పంగు లూరు, అద్దంకి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం

చలివేంద్రం ప్రారంభిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

త్రిమూర్తులు, ఐక్యవేదిక గౌరవ సలహాదారులు చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు చక్రపాణి యాదవ్, అన్నమనేని వెంకటరావు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు కందుల గంగాధర్, ఎపి ఎస్‌సిడబ్ల్యూఎ జిల్లా అధ్యక్షులు నక్కా కాంతారావు తదితరలు సందేశాలు ఇచ్చారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

బాపట్ల ఇస్లాంపేట ఈద్గాలో నమాజు చేస్తున్న ముస్లింలు

ప్రజాశక్తి - బాపట్ల

రంజాన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇస్లాంపేట, జమేదార్ పేట ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గల్లో నమాజుకు అవసరమైన సౌకర్యాలను అంజుమన్ ఇస్లామీయా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. బాపట్ల, కర్లపాలెం, చందోలు ప్రాంతాల్లోని ఈద్గాల్లో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో ఎంఎల్ఎ కోన రఘుపతి, టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని అనంతవరం, యద్దనపూడి, గన్నవరం, పూనూరు, పోలూరు, పెదజాగార్లమూడి గ్రామాల్లో ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పండుగను ఆనందంగా జరుపు కున్నారు. అనంతవరం ఉప సర్పంచ్ షేక్ శ్రీనివాసబాబు, మసీద్ ఇమామ్ గౌస్, జాగార్లమూడి విఆర్ఒ వలి, నాగూర్, సైదా, గాలి షహీద్, అల్లం పాల్గొన్నారు.

సంతమాగులూరు : ఏల్చూరు, కొమ్మాలపాడు, సంతమా గులూరు, కొప్పరం, మిన్నేకల్లు, పుట్టావారిపాలెం గ్రామాల్లోని ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

పొదిలి : పట్టణంలో ముస్లిం సొదరులు రంజాన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్కాపురం వైసిపి అభ్యర్థి అన్న రాంబాబు తనయుడు క్రిష్ణచైతన్య ముస్లిం సొదరులను ఆలింగనం చేసుకొని శు భాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మల్లికార్జునరావు, పొదిలి, కొనకనమిట్ల ఎస్ఐలు జి కోటయ్య, మాధవరావు బందోబస్తు నిర్వహించారు.

ఇంకొల్లు రూరల్ : స్థానిక ఈద్గా వద్ద జామియా మసీదు ఆధ్వర్యంలో, అక్సా మసీదు, మక్కా మసీదు వద్ద ముస్లీం సోదరులు ప్రార్థనలు జరుపుకున్నారు. నాగండ్ల, గంగ వరం, ఇడుపులపాడు, వంకాయలపాడు, పావులూరు, నక్కలపాలెం గ్రామాల్లో రంజాన్ ప్రార్థనలు చేశారు.

పర్చూరు : స్థానిక యార్డులో పార్థనలు చేశారు. మండలంలోని నూతలపాడు, నాగులపాలెం, ఉప్పుటూరు, వీరన్నపాలెం, చెరుకూరు, గర్నెపూడి గ్రామాల్లో ప్రార్థనలు చేశారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇంకొల్లు ఈద్గా వద్ద ముస్లిం సోదరుల ప్రార్థనలు

స్పెల్ బి కాంటెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులు

పఠనా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి - పంగులూరు

విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అప్పుడప్పుడు పోటీ పరీక్షలు నిర్వహించాలని విద్యావేత్త పేర్ని వీరనారాయణ అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో పేర్ని సుబ్బయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన స్పెల్ బి కాంటెస్ట్ విజేతలకు గురువారం బహుమతులు అందజే శారు. పోటీ పరీక్షల ద్వారా పఠనా నైపుణ్యాన్ని పెంచుకొని చదువు పట్ల ఆసక్తితో మెలగాలని అన్నారు. అనంతరం స్పెల్ బి కాంటెస్ట్ విజేతలైన రేణింగవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఉదయ్, లోకేస్‌కు ప్రథమ బహుమతి, కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శ్రావణ్ కుమార్, హేమశ్రీ ద్వితీయ బహుమతి అందుకున్నారు. కొండమంజులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు పవన్, గోపి, నవీన్ తృతీయ బహుమతిని సాధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వేణుబాబు, ఉపాధ్యాయులు రామకోటిరెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని గుర్రంవారిపాలెం గ్రా మానికి చెందిన సుబ్బా రావు, రేణుక దంపతు లు చేపలు అమ్ముకొని జీవనం సాగిస్తుంటారు. గురువారం సింగర కొండ వద్ద చేపలు పట్టు కొని అద్దంకి పట్టణంలో అమ్ముకోవటానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా స్థానిక భవాని సెంటర్ దగ్గరకు వచ్చేసరికి వెనక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చొని ఉన్న రేణుక అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు స్వల్ప గాయాలు అయ్యాయి. ద్విచక్ర వాహనంతో పాటు ప్రక్కనే మరో ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టింది. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

ప్రజాగళం సభా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కొల్లూరులో జరుగనున్న ప్రజాగళం సభ ఏర్పాట్లపై మాజీ మంత్రి నక్కా ఆనందబాబు కార్యకర్తలతో మాట్లాడారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ వాకా శేషుబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తనుగొట్ల సాయిబాబా, నాయకులు బట్టు మల్లికార్జునరావు, ఎడ్ల జయసిలరావు, కనపర్తి సుందరరావు పాల్గొన్నారు.

కొల్లూరు : రిక్రియేషన్ క్లబ్ నందు గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి నక్క ఆనందబాబు మాట్లాడారు. స్థానిక శివాలయం సెంటర్లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు చంద్రబాబు ప్రజాగళం రోడ్ షో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జనసేన ఇన్‌ఛార్జి ఊస రాజేష్, టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూదన ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు బొందలపాటి చలమయ్య పాల్గొన్నారు.

సమతానగర్ ఘటనలో

36 మందిపై కేసు నమోదు

- దిశ డిఎస్‌పితో విచారణ
- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని సమతానగర్‌లో జరిగిన ఘర్షణలో పలువురు హాస్పిటల్‌లో చేరారని, ఇరు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో 36 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. ఈ కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టడానికి ప్రత్యేకంగా దిశ డిఎస్‌పిని నియమించామన్నారు. నిష్పక్షపాత, పారదర్శక, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక పాటించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి గొడవలు, అల్లర్లుకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఒక రాజకీయ పార్టీకి చెందిన వారు ఒంగోలు సమతా నగర్ 1వ లైన్‌లోని ఒక అపార్ట్‌మెంట్ వద్ద ప్రచారం చేస్తుండగా మరొక పార్టీకి చెందిన వారితో ఘర్షణకు దిగారన్నారు. ఇదే కేసుకు సంబంధించి ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ లో జరిగిన సంఘటనపై రిమ్స్ డ్యూటీ డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తునకు చీమకుర్తి సిఐని అప్పగించినట్లు ఎస్‌పి తెలియజేశారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రశాంత వాతావరణానికి ఎటువంటి భంగం కలగకుండా ప్రవర్తించాలన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పక పాటించి సహకారం అందించాలన్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అల్లర్లు సష్టించినా, గొడవలు ప్రేరేపించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి హెచ్చరించారు.

సామాజిక ఉద్యమకారుడు పూలే

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సామాజిక ఉద్యమకారుడిగా చరిత్రలో నిలిచి పోయిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పుష్ప మాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా బీసీసంక్షేమశాఖ అధికారి నర్సారెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

పూలే జీవితం ఆదర్శం

జ్యోతిరావు పూలే జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త, సమసమాజ స్థాపనకై అహర్నిశలు కృషి చేసి కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్.ఐ డి.శ్రీనివాసరెడ్డి, సెబ్ ఇన్స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఐటి కోర్ ఎస్సై నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

ఒంగోలులో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నేతలు

పూలేకి నివాళి

ఒంగోలు కలెక్టరేట్: జ్యోతిభాపూలే జయంతి సందర్భంగా గురువారం స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు జె సంజీవరావు, అట్లూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

వైసిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-దర్శి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు వైసిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. తాళ్లూరు మండలం దారంవారిపల్లి, మన్నేపల్లి గ్రామాల్లో డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందిని గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మారం వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసి వైస్ ఎంపిపి మంచాల ప్రియాంక, నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచి మారం వలసారెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు జెడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, తూము సుబ్బారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపిపిలు పోశం మధుసూదనరెడ్డి, గొల్లపాటి మోషే పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

మత్తు పదార్థాలతో కుటుంబాలు అస్తవ్యస్తం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న మద్యపానం, మత్తు పదార్థాలతో మహిళల జీవితాలు, కుటుంబ వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారుతున్నాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు దారావారి కుంట ప్రాంతంలో గురువారం మున్సిపల్ మహిళా కార్మికుల సమావేశం ఐద్వా ఒంగోలు నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మద్యం, మత్తు పదార్థాల వినియోగం, సమాజంపై చూపుతున్న వినాశకర పరిణామాలు అనే అంశం మీద డి.రమాదేవి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తాము అధికారంలోకి వస్తే దశలవారీగా సంపూర్ణ మద్యపాన నిషేదాన్ని అమలు చేస్తామని ఎన్నికల నాడు ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించారన్నారు. మద్యాన్ని నిషేధించకపోగా విచ్చలవిడిగా అమ్మకాలకు గేట్లు తెరిచారని అన్నారు. దానికితోడు ఈ కాలంలో మత్తుపదార్థాల వినియోగం విపరీతంగా పెరిగిందని, ప్రపంచంలోని అనేక ప్రాంతాల నుంచి పెద్దఎత్తున డ్రగ్స్ మన దేశంలోకి, రాష్ట్రంలోకి దిగుమతి అవుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ క్వింటాళ్ల కొద్దీ గంజాయి, వివిధ రకాల డ్రగ్స్‌ను అధికార యంత్రాంగం పట్టుకుంటున్నా వాటి వరద ప్రవాహం మాత్రం ఆగడం లేదన్నారు. 20 శాతం మాత్రమే అడ్డుకట్ట పడుతోందని, 80 శాతం అడ్డగోలుగా అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు అమ్ముకాలు చేస్తున్నారని అన్నారు. ప్రధానంగా యువత వీటికి బానిసలవుతున్నారని, ఫలితంగా భవిష్యత్తు భారత దేశం ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ స్వయం సేవా సంఘాలకు సహాయపడటం లేనూ, డ్వాక్రా మహిళలకు వారి కాళ్లపై వారు నిలబడే విధంగా తోడ్పాటును అందించడంలోనూ ప్రభుత్వాలు విఫలం చెందాయని చెప్పారు. మద్యం, మత్తు పదార్థాలతోపాటు నిత్యం పెరుగుతున్న ధరలు మహిళల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. కార్యక్రమంలో తేళ్ల విజయ, బి దివ్య, కుందా అక్కమ్మ, కె మరియమ్మ, వి నాగమ్మ, కె రాణి, ఎస్ శిరోమణి, జి కెజియారాణి, ఎ రమాదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

పక్షపాతం వహిస్తున్న అధికారులపై చర్యలు

సిఇఒకు టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విధులలో పక్షపాతం వహిస్తున్న పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలుగుదేశం పార్టీ ప్రతినిధి ఐపి అనిల్ కుమార్ ఫిర్యాదు చేశారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన సిఇఒను కలిసిన టిడిపి ప్రతినిధి మాట్లాడుతూ ఒంగోలు తాలూకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భక్తవత్సలరెడ్డి, వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ పక్షపాత వైఖరిపై తాము పదేపదే నిరసన తెలిపి డాక్యుమెంటరీ రుజువులను సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బుధవారం రాత్రి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిపై 300-400 మంది వ్యక్తులు దాడి చేసి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. దాడికి కారకులైన వారిపై చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిఇఒకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు

ముస్లిములకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రంజాన్ పండుగను పురస్కరించుకొని కొణిజేటి బస్టాండ్ సెంటర్ వద్ద ఈద్గా వద్ద ముస్లిములకు మజ్జిగను పంపిణీ చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ఒంగోలు ముస్లింలకు డిసిసి అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బిఆర్ గౌస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, కరిముల్లా ఖాన్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఉంగరాల శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి కిషోర్ పాల్గొన్నారు.

ఉపాస్, యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో

గుండెకు అరుదైన శస్త్రచికిత్స

పేషెంట్‌కు ప్రాణాపాయం తప్పించిన వైద్యబృందం

ప్రజాశక్తి-ఒంగోలు

ఉపాస్ హాస్పిటల్, యశోద హాస్పిటల్స్ వారు క్రిటికల్ అయోర్టిక్ డిసెక్షన్ ఉన్న రోగికి విజయవంతమైన శస్త్రచికిత్స చేసి.. అతని ప్రాణాలు కాపాడారు. రెండు హాస్పిటల్స్ వైద్యులు గురువారం ఉపాస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశ్వనాథశర్మ అనే వ్యక్తి ఇటీవల తీవ్రమైన గుండె నొప్పితో ఉపాస్ ఆసుపత్రిలో చేరారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ చివుకుల ఈ కేసును ప్రాణాంతక రకం ఏ అయోర్టిక్ డిసెక్షన్‌గా గుర్తించారు. యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు రిఫర్ చేసింది. అక్కడ పేషెంట్ డాక్టర్ సత్య శ్రీధర్ కాలే సంరక్షణలో ఉన్నాడు. యశోద హాస్పిటల్స్‌లోని మల్టీస్పెషాలిటీ బృందం రోగ నిర్ధారణను నిర్ధారించి 24 గంటల్లో శస్త్రచికిత్స చేసింది. విజయవంతమైన శస్త్రచికిత్స శర్మ జీవితాన్ని కాపాడింది. ఆయన బాగా కోలుకుంటున్నాడు. ఉపాస్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ కేసు సకాలంలో రోగ నిర్ధారణ మరియు ఆరోగ్య సంరక్షణ సంస్థల మధ్య సమర్థవంతమైన సహకారం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుందని చెప్పారు. పరిస్థితిని గుర్తించడంలో తమ బృందం వేగవంతమైన చర్య, యశోద హాస్పిటల్స్ ప్రత్యేక కార్డియాక్ కేర్ యూనిట్‌కు అతుకులు లేకుండా బదిలీ చేయడం వల్ల శర్మకు సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితం లభించేలా చేసిందన్నారు. ఉపాస్ హాస్పిటల్‌లో శర్మను మొదట అంచనా వేసిన డాక్టర్ శ్రీధర్ చివుకుల మాట్లాడుతూ 'బృహద్ధమని విచ్ఛేదం' అనేది వైద్యపరమైన అత్యవసరం, వేగవంతమైన జోక్యం కీలకమన్నారు. ఆసుపత్రి సెట్టింగ్‌తో సంబంధం లేకుండా రోగులకు సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణను అందించడానికి వైద్య సహకారం కీలక పాత్రను ఈ కేసు నొక్కి చెబుతుందన్నారు. యశోద హాస్పిటల్స్ దాని అధునాతన కార్డియాక్ కేర్ సౌకర్యాలు మరియు నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిందన్నారు. వారి బృందం వేగంగా తమైన రోగనిర్ధారణ మరియు విజయవంత తమైన శస్త్రచికిత్స ప్రాణాలను రక్షించే చికిత్సను అందించడంలో వారి నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలిపారు.

మాట్లాడుతున్న ఉపాస్ హాస్పిటల్ గుండె వైద్యనిపుణులు శ్రీధర్ చివుకుల